
2లో.

**రూ.300 కోట్లతో స్కిల్ డెవలప్ మెంట్ కేంద్రాలు**

RNI NO :Title-Code :-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దినపత్రిక
అనుక్షణం ప్రజలపక్షం...

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పనిచేయుటకు
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.
ఎడిటర్ : బిర్రు కరుణాకర్
Cell: 9701249103

సంపుటి - 1  సంచిక - 193  గురువారం18 జూలై 2024  ఎడిటర్ : బిర్రు కరుణాకర్  పేజిలు -5  వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## బీఆర్ఎస్‌ను ఎవరూ ఏమీ చేయలేరు...

**రేవంత్ రెడ్డి గుర్తిస్తే మంచిది: హరీశ్ రావు**

ఎమ్మెల్యేల బలం ఉన్నా... లేకపోయినా పార్టీకి కలిగే నష్టం ఏమీ లేదని వ్యాఖ్య

బీఆర్ఎస్ ఎన్నో ఆటుపోట్లను తట్టుకొని నిలబడిందన్న హరీశ్ రావు

గూడెం మహిపాల్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ తక్కువేమీ చేయలేదని వెల్లడి

పార్టీ మారిన ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టండని చెప్పి రేవంత్ మాట తప్పారని ఆగ్రహం

2లో.



# ఇచ్చిన హామీని అమలు చేస్తున్నాం

**నా జీవితంలో మరిచిపోలేని రోజు : రుణమాఫీపై సీఎం రేవంత్ రెడ్డి**

**వరంగల్ డిక్లరేషన్ హామీని అమలు చేస్తున్నామన్న సీఎం**

**పార్టీకి నష్టమని తెలిసినా సోనియమ్మ తెలంగాణ ఇచ్చారని వెల్లడి**

**కేసీఆర్ లాగా మాటలు చెప్పి మభ్యపెట్టడం లేదన్న రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్ జులై 17,(జర్నలిస్ట్ వార్త):** రైతులకు ఇచ్చిన హామీ మేరకు మొదటి విడతగా నేడు రూ.1 లక్ష వరకు రుణమాఫీ చేస్తున్నామని, ఇది తన జీవితంలో మరిచిపోలేని రోజు అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజాభవన్‌లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కాంగ్రెస్ నాయకులతో భేటీ నేపథ్యంలో బుధవారం ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 2022 మే 6న వరంగల్ డిక్లరేషన్ ద్వారా రాహుల్ గాంధీ రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని మాట ఇచ్చారని గుర్తు చేశారు. పదేళ్లు అధికారంలో ఉండి కూడా కేసీఆర్ రూ.28 వేల కోట్లు కూడా రైతు రుణమాఫీ చేయలేకపోయారన్నారు. ఆగస్ట్ 15లోగా రైతు రుణమాఫీ చేస్తామని పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో చెప్పామన్నారు. ఆర్థిక నిపుణులు కూడా రుణమాఫీ కష్టమని చెప్పారని... ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరించారని పేర్కొన్నారు. అయినప్పటికీ రుణమాఫీ చేస్తున్నామన్నారు.




మిగతా 2లో.

## షెడ్యూల్ ప్రకారం డీఎస్సీ రిక్రూట్‌మెంట్ పరీక్షలు..

**పరీక్షల వాయిదా కోరుతూ విద్యార్థుల నిరసనలు**


**జులై 18 నుంచి ఆగస్టు 5 వరకూ జరగనున్న పరీక్షలు**



**హైదరాబాద్ జులై 17,(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో గురువారం నుంచి డీఎస్సీ రిక్రూట్‌మెంట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వం షెడ్యూల్ ప్రకారమే పరీక్షల నిర్వహణకు మొగ్గు చూపింది. టెట్ నిర్వహణ, డీఎస్సీ ప్రిపరేషన్ కోసం మరికొంత సమయం కావాలంటూ అభ్యర్థులు పరీక్షల వాయిదా వేయాలని గత కొన్ని రోజులుగా ఆందోళన చేపడుతున్నారు. అయితే, ప్రభుత్వం షెడ్యూల్ ప్రకారం, పరీక్ష నిర్వహించేందుకు రెడీ అయ్యింది. ఇక పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఇప్పటివరకూ 11,062 పోస్టుల భర్తీకి 2.79 లక్షల దరఖాస్తులు అందినట్లుగా అధికారులు తెలిపారు. మంగళవారం సాయంత్రానికి 2,40,727 మంది హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. జులై 18 నుంచి ఆగస్టు 5 వరకూ పరీక్షలు నిర్వహించనున్నారు. తెలంగాణ వ్యాప్తంగా 14 జిల్లాల్లో 56 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. డీఎస్సీ పరీక్షలు రోజుకు రెండు విడతల్లో నిర్వహించనున్నారు. హాల్ టిక్కెట్లలో తప్పులు దొర్లాయంటూ పెద్ద సంఖ్యలో తెలంగాణ పాఠశాల విద్యాశాఖ కార్యాలయానికి విద్యార్థులు రావడంతో వాటిని సరి చేసి ఆన్‌లైన్‌లోనే అందుబాటులో ఉంచనున్నట్లు అధికారులు తెలిపారు.

## రెండేళ్ల బాలుడిని పీక్కుతిన్న వీధికుక్కలు

**మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ లో దారుణం..**



**హైదరాబాద్ జులై 17,(జర్నలిస్ట్ వార్త):** జిహెచ్ఎంసీ పరిధిలో వీధి కుక్కల దాడిలో మరో బాలుడు బలియ్యాడు. మంగళవారం సాయంత్రం రెండేళ్ల బాలుడిపై వీధి కుక్కల దాడి చేసి పీక్కుతిన్నాయి. ఈ దారుణ సంఘటన మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ లో చోటుచేసుకుంది. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వికలాంగుల కాలనీలో రెండేళ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. వెంటనే ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. దీంతో కుటుంబంతోపాటు కాలనీలో విషాదం నెలకొంది.కాగా..జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గత కొద్ది నెలలుగా వీధి కుక్కలు సైర విహారం చేస్తున్నాయని అయినప్పటికీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే వీధికుక్కలు రెచ్చిపోతున్నాయని మండిపడుతున్నారు.



## మహారాష్ట్రలో భారీ ఎన్‌కౌంటర్...

**12 మంది మావోయిస్టుల హతం**

**వందోలి గ్రామం వద్ద నక్సల్స్ ఉన్నారన్న సమాచారంతో భద్రతా బలగాల కూంబింగ్**

**ఆరు గంటలకు పైగా ఇరు పక్షాల మధ్య భీకర కాల్పులు**

**మృతుల్లో ఇద్దరు తెలుగు వాళ్లు!**

2లో.

## పోచమ్మ తల్లికి ప్రత్యేక బోనాలు

**- బోనం ఎత్తుకున్న మంత్రి కొండా సురేఖ**



**వరంగల్, జులై 17,(జర్నలిస్ట్ వార్త):** వరంగల్ మహానగరంలోని ఓ.సిటీలో బుధవారం జరిగిన బీరన్న స్వామి బోనాల కార్యక్రమంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మాత్యులు కొండ సురేఖ పాల్గొన్నారు. గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి పాల్గొని బోనం ఎత్తుకున్నారు. ఈ సందర్భంగా పోచమ్మ దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి కొండా సురేఖ నగర ప్రజలందరికీ పోచమ్మ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆ పోచమ్మతల్లి అమ్మవారి ఆశీస్సులు నగర ప్రజలందరి పై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఓని స్వర్ణలత భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## రూపాయి రూపాయి పోగుచేసి ఈ కార్యక్రమం చేపట్టాం

3లో.

: తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

# ప్రాజెక్టుల నిర్మాణాల వేగవంతం కోసం నీటి పారుదల శాఖ రూట్ మ్యాప్

## 2025, డిసెంబర్ నాటికి పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

## రాష్ట్ర నీటి పారుదల , పౌర సరఫరాల శాఖామంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్ జులై 17,(జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్రంలోనీ ప్రాజెక్టుల నిర్మాణాల వేగవంతం కోసం నీటి పారుదల శాఖా రూట్ మ్యాప్ రూపొందించుకుందని రాష్ట్ర నీటి పారుదల , పౌర సరఫరాల శాఖామంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల మహబూబ్నగర్ పర్యటనలో ఇచ్చిన హామీ మేరకు 2025 డిసెంబర్ నాటికి ఆ జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నట్లు ఆయన వెల్లడించారు.



పాలమూరు రంగారెడ్డి తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్ట్ ల పురోగతి తో పాటు నిర్మించాల్సిన ప్రాజెక్టుల పై బుధవారం రోజున జలసౌధ లో నీటిపారుదల అధికారులతో ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. నీటి పారుదల శాఖా కార్యదర్శి రాహుల్ బొజ్జ,అదనపు కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,నీటిపారుదల శాఖా సలహాదారు అదిత్యా దాస్, ఇ యన్ సి అనిల్ కుమార్ సంబంధిత అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.
అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కృష్ణా బేసిన్ పరిధిలోని పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ తో పాటు మహబూబ్నగర్ జిల్లాలోని కోయిల్ సాగర్,ఆర్ బి ఎల్ ఐ యస్,జే. ఎన్.ఎల్.ఐ .యస్,డిండి ఎల్ ఐ యస్,ఏ.యం.ఆర్ యస్ ఎల్ బి సి ,నెట్టెంపాడు, భీమా,కల్వకుర్తి ఎల్ ఐ సి లతో పాటు గోదావరి బేసిన్ పరిధిలోని చిన్న కాళేశ్వరం, నిల్వాయి ప్రాజెక్ట్,పాలెం వాగు,మత్తడి వాగు,యస్.ఆర్ యస్.పి ఫేస్2,చనాకా కోరాట,లోయర్ పెన్ గంగా, దేవాదుల ,మోదీ కుంటవాగు,యస్.వై.పి ??,జే సి ఆర్ డి ఎల్ ఐ యస్, సీతారామ ఎల్ ఐ యస్ లపై సమగ్రమైన సమీక్ష నిర్వహించినట్లు ఆయన తెలిపారు.
వాటిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రాజెక్ట్ లతో పాటు గోదావరి బేసిన్ పరిధిలోని చిన్న కాళేశ్వరం, మోదీకుంట,లోయర్ పెన్ గంగా, చనాక కోరాట,శ్రీపాద ఎల్లంపల్లి,జే సి ఆర్ డి ఎల్ యస్ తదితరాలు పూర్తి చేసేందుకు ఎనిమిది వేట కోట్ల పై చిలుకు అవుతుందన్న అంచనాకు అధికారులు వచ్చారన్నారు .అయితే అదే సమయంలో 2025 డిసెంబర్ మాసాంతానికి పూర్తి చేయాలన్న నిర్దేశిత లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించుకున్న తాము నీటి పారుదల శాఖకు అదనంగా మరో 11 వేల కోట్ల బడ్జెట్ ప్రతిపాదనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో ఆర్థిక శాఖాకు పంపాలని నిర్ణయించామన్నారు.
రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ లో 28,000 కోట్లు నీటి పారుదల శాఖకు కేటాయించగా అందులో గత ప్రభుత్వం ప్రాజెక్ట్ ల నిర్మాణాల పేరుతో చేసిన అప్పులకు కడుతున్న వడ్డియే 18,000 కోట్లు అని మరో రెండు వేల కోట్లు జీత భత్యాలకే ఖర్చు అవుతున్నాయని మంత్రి ఉత్తమ్ తెలిపారు. అందుకే అదనపు బడ్జెట్ ను సమీకరించుకుని సకాలంలో ప్రాజెక్టులు పూర్తి చేసి ఆరు లక్షల పై చిలుకు ఎకరాలు సేద్యంలోకి తేవాలన్న లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. అందులో భాగంగా ప్రాధాన్యత క్రమంలో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణాలను ఏ,బి,సి కేటగిరీలుగా విభజించామన్నారు. ఇప్పటికే పూర్తి కావొచ్చిన వాటిని ఏ కేటగిరీలో, ఆ తరువాత బి,ఆ తరువాత సి లుగా విభజించడం జరిగిందన్నారు.
ఏ కేటగిరీలో 240.66 కోట్లతో 47,882 ఏకరాల ఆయకట్టును సేద్యం లోకి తీసుకొస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అదే విదంగా ఆన్ గోయింగ్ ప్రాజెక్టులుగా నిర్మితమౌతున్న ప్రాజెక్టులకు సుమారు 7,500 కోట్ల పై చిలుకు అంచనా వ్యయంతో 5,84,770 ఎకరాల ఆయకట్టు భూమిని సేద్యం లోకి తీసుక రానున్నట్లు ఆయన చెప్పారు. అదే విదంగా నిర్మల్ జిల్లా సదర మాట్ ప్రాజెక్టు ను ఈ నేల చివరి నాటికి,ఖమ్మం జిల్లాలో రాజీవ్ కెనాల్(సీతారాం ప్రాజెక్ట్ )ను ఆగస్టు 15 న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# ఫడ్నవీస్, అజిత్ పవార్‌లకు త్రుటిలో తప్పిన ముప్పు

**హైదరాబాద్ జులై 17,(జర్నలిస్ట్ వార్త):**
మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడ్నవీస్, అజిత్ పవార్, పరిశ్రమల శాఖ మంత్రి ఉదయ్ సామంత్ బుధవారం త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. నాగపూర్ నుంచి గడ్చిరోలికి వారు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ప్రతికూల వాతావరణం మధ్య దారి తప్పింది. అయితే, పైలట్ నిపుణతతో హెలికాప్టర్‌ను సరిగ్గా దారిలోకి తెచ్చి గడ్చిరోలిలో భద్రంగా దించారు. గడ్చిరోలి జిల్లా అహెరి తహసీల్‌లో రూ. 10 వేల కోట్ల సుర్జాగడ్ ఇస్పాత్ సమీకృత ఉక్కు ప్రాజెక్టుకు శంకుస్థాపన నిమిత్తం వారు ముగ్గురూ గడ్చిరోలి వెళ్లారు. అజిత్ పవార్ ఈ ఉదంతాన్ని సభలో వివరించారు. తాము భద్రంగా దిగడానికి పైలట్ నైపుణ్యమే కారణమని



ఆయన శ్లాఘించారు. 'హెలికాప్టర్ మామూలుగా నాగపూర్ నుంచి గడ్చిరోలికి బయలుదేరింది. మా టేకాఫ్ తరువాత నేను మేఘాలు చూస్తూ సుఖంగా కూర్చున్నాను.వాటిని చూడవలసిందని ఫడ్నవీస్‌కు సూచించాను. అయితే, ప్రయాణంలో మబ్బుల వల్ల హెలికాప్టర్ దారి తప్పింది. అయినప్పటికీ ఫడ్నవీస్ నిబ్బరంగా ఉండి, నాతో మాట్లాడుతూనే ఉన్నారు. నేను ఏమీ తోచని స్థితిలో పడ్డాను. కలవరపడుతున్నాను. అయితే, ఆందోళన చెందవద్దని, తనకు ఇంతకు ముందు ఆరు ప్రమాదాలు జరిగాయని, సురక్షితంగా బయటపడ్డానని ఫడ్నవీస్ నాతో చెప్పారు. ఇప్పుడు నేను కూడా సురక్షితంగానే ఉంటానని నాతోఆయన చెప్పారు. కలవరపడవద్దని నాతో ఫడ్నవీస్ పదే పదే చెప్పినట్లు అజిత్ పవార్ తెలిపారు. 'భద్రంగా కిందకు దిగుతామా అనే ఆందోళనలో ఉన్నాను. కాని ఫడ్నవీస్‌లో ఏమాత్రం కంగారు లేదు. ల్యాండింగ్ ప్రదేశం కోసం చూస్తూ ఉండవలసిందని నాతో ఉదయ్ సామంత్ చెప్పారు. కిటికీలో నుంచి దానిని చూసిన తరువాత నాకు ఊరట కలిగింది' అని అజిత్ పవార్ తెలియజేశారు.

# రూ.300 కోట్లతో స్కిల్ డెవలప్ మెంట్ కేంద్రాలు



**హైదరాబాద్ జులై 17,(జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణా రాష్ట్ర వ్యాప్తంగా రూ.300 కోట్ల వ్యయంతో నైపుణ్య అభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ప్రపంచంలోని పది ప్రఖ్యాత యూనివర్సిటీలు ముందుకువచ్చాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. హైదరాబాద్ కేంద్రంగా 25 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహించే 'ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్(ఐఎస్ ఎఫ్) ', టెక్సస్ కేంద్రంగా ఉన్న 'స్టార్టప్ రన్ వే' సంస్థల ప్రతినిధులతో సెక్రటేరియట్ లోని తన కార్యాలయంలో శ్రీధర్ బాబు సమావేశమయ్యారు. అంతర్జాతీయంగా స్టార్టప్ లను ప్రోత్సహించే ఈ రెండు సంస్థలకు అమెరికా లోని యూనిర్సిటీ ఆఫ్ టెక్సస్, యూకెలోని లండన్ బిజినెస్ స్కూల్ లాంటి పది ప్రఖ్యాత స్కిల్ యూనివర్సిటీలతో శిక్షణకు సంబంధించిన ఒప్పందాలున్నాయి. సెప్టెంబర్ 26-28 ల మధ్య నగరంలో జరిగే ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ సదస్సు లో ఈ యూనివర్సిటీల ప్రతినిధులు కూడా పాల్గొంటారని శ్రీధర్ బాబు తెలిపారు.ఐఎస్ ఎఫ్ ఛైర్మన్ డా. జె.ఎ.చౌదరి, డైరెక్టర్ శేషాద్రి వంగల ఆధ్వర్యంలో టెక్సస్ రిచర్డ్ సన్ సిటీ, ఫ్రిస్కో సిటీల ప్రతినిధులు తనను కలిసి తెలంగాణాలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ'లో సంయుక్తంగా కార్యకలాపాలు చేపట్టడానికి ఆసక్తి వ్యక్తంచేసారని ఆయన వివరించారు. అమెరికా, బ్రిటన్ కు చెందిన కంపెనీలు ఏఐ సిటీలో పెట్టుబడులు పెట్టేందుకు సంధానకర్తలుగా ఈ ప్రతినిధులు వ్యవహరిస్తారని వెల్లడించారు. తెలంగాణాలోని స్టార్టప్ కంపెనీల ఉత్పత్తులకు అమెరికాలో మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడానికి సహకరిస్తారని అన్నారు. తమ ప్రభుత్వం స్టార్టప్ ఫ్రెండ్లీ వాతావరణాన్ని ఇప్పటికే ఏర్పరిచిందని తెలిపారు. శ్రీధర్ బాబును కలిసిన ప్రతినిధి బృందంలో టెక్సస్ లోని ఫ్రిస్కో నగరం మాజీ మేయర్ మహెర్ మేసో, రిచర్డ్ సన్ సిటీకి చెందిన ప్రతినిధులు క్రిష్ షాక్లెట్, గ్రెగ్ సోవెల్, స్టార్టప్ రన్ వే వ్యవస్థాపకుడు మహేశ్ నంద్యాల, సిఓఓ రవీంద్ర రెడ్డి, చిన్మయ్ దాస్, జ్యోత్స్న కొండపులి, అర్చన చిందం, ఐఎస్ ఎఫ్ తరపున వేణుమాధవ్ గొట్టుపుల్ల తదితరులు పాల్గొన్నారు.

## జయప్రదంగా ముగిసిన 'బీబీ కా ఆలమ్' ఊరేగింపు



**హైదరాబాద్ జులై 17,(జర్నలిస్ట్ వార్త):**
ఇస్లామీ క్యాలెండర్ నెల ముహర్రం 10 వ రోజున నేడు పాత బస్తీలో 'యౌమే అషూర' నిర్వహించారు. ఈ సందర్భంగా బీబీ కా ఆలమ్ ఊరేగింపును బీబీ కా అలావ నుంచి చాదర్ ఘాట్ వరకు జయప్రదంగా నిర్వహించారు. ముస్లింలలో ఒక వర్గం అయిన షియా తెగ వారు ఈ ఊరేగింపులో పాల్గొన్నారు. 'ఆలమ్' అనేది ఓ పవిత్ర కర్ర లేక జెండా. ఇది 'కర్బలా' పోరుకు గుర్తు.హైదరాబాద్ పాతబస్తీలోని అలీజా కోట్లా, పురానీ హవేలీ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక ప్రార్థనలు, సమావేశాలు నిర్వహించడమే కాక ఫుడ్ క్యాంప్ లు కూడా ఏర్పాటు చేశారు. నేడు పాత బస్తీలో చాలా వరకు దుకాణాలను మూసి ఉంచారు. చివరికి ఊరేగింపు చాదర్ ఘాట్ లోని మజీద్-ఏ-ఇలాహి వద్ద ముగిసింది.చార్మినార్ వద్ద పోలీస్ కమిషనర్ కె. శ్రీనివాస్ రెడ్డి , తదితర పోలీసు అధికారులు 'ధట్టీ' లను అర్పించుకున్నారు.

# బీఆర్ఎస్‌ను ఎవరూ ఏమీ చేయలేరు...

**హైదరాబాద్ జులై 17,(జర్నలిస్ట్ వార్త):**
బీఆర్ఎస్ పార్టీని ఎవరూ ఏమీ చేయలేరని, ఆ విషయం అధికారపక్షం గుర్తిస్తే మంచిదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ నేపథ్యంలో హరీశ్ రావు ఆ నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలతో సమవేశమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎమ్మెల్యేల బలం ఉన్నా... లేకపోయినా పార్టీకి కలిగే నష్టం ఏమీ లేదన్నారు. 2001లో కేసీఆర్ తెలంగాణ ఉద్యమం ప్రారంభించినప్పుడు పిడికెడు మంది మాత్రమే ఉన్నారని... వైఎస్ హయాంలో తమ ఎమ్మెల్యేలను లాక్కున్నారని... ఇన్ని ఆటుపోట్లు తట్టుకొని పార్టీ నిలబడిందన్నారు.
గూడెం మహిపాల్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ తక్కువేమీ చేయలేదన్నారు. ఆయనను మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించింది బీఆరెస్సే అన్నారు. అయినప్పటికీ ఆయన పార్టీ నుంచి వెళ్లిపోయినంత మాత్రాన వచ్చే నష్టమేమీ లేదన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు గుండెధైర్యంతోనే ఉన్నారని పేర్కొన్నారు.కేసీఆర్ నాయకత్వంలో తమ పార్టీ కేవలం ప్రజలను, కార్యకర్తలను మాత్రమే నమ్ముకుందన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టండని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డే ఇప్పుడు మాట తప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఉన్న బలం చాలక విపక్ష ఎమ్మెల్యేలను లాక్కుంటున్నారని ధ్వజమెత్తారు.

# ఆదివాసుల ఆత్మ బంధువు సీతక్క



**హైదరాబాద్ జులై 17,(జర్నలిస్ట్ వార్త):**
యువ సాహిత్య రత్న, ప్రముఖ సామాజిక రచయిత కడియాల సురేష్ కుమార్ రాసిన ఆదివాసుల ఆత్మ బంధువు సీతక్క పుస్తకాన్ని బుధవారం నాడు ప్రజా భవన్ లో రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ఆవిష్కరించారు. తన జీవిత చరిత్ర పై పుస్తకం రాసి తన తల్లిదండ్రులకు అంకితం చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నట్లు మంత్రి చెప్పారు. ములుగు ప్రాంత వాసి స్వశక్తితో ఎదిగిన సురేష్ మంచి రచయితగా గుర్తింపు పొందాలని ఆకాంక్షిస్తూ శాలువాతో సన్మానించారు.
సీతక్క జీవితం,ఉద్యమం, పోరాటాల గురించి అనేక వివరాలు సేకరించి రచయిత సురేష్ కుమార్ తన పుస్తకం లో పొందుపరచారు. ఈ పుస్తకానికి లోకసత్తా వ్యవస్థాపకులు డా. జయ ప్రకాష్ నారాయణ్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సి. కాశీం, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు ముందుమాట రాసారు. ఈ కార్యక్రమం లో బీసీ సంక్షేమ సంగం మహిళా నాయకురాలు మాహియా రాజ్, సుష్మ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# మహారాష్ట్రలో భారీ ఎన్ కౌంటర్... 12 మంది మావోయిస్టుల హతం

జూలై 17: జర్నలిస్ట్ జర్నీ న్యూస్:
మహారాష్ట్రలోని గడ్చిరోలిలో భారీ ఎన్ కౌంటర్ జరిగింది. మహారాష్ట్ర-చత్తీస్ గఢ్ సరిహద్దుల్లోని వందోలి అటవీప్రాంతంలో ఈ ఎన్ కౌంటర్ చోటుచేసుకుంది. ఈ ఎదురుకాల్పుల ఘటనలో 12 మంది నక్సల్స్ మృతి చెందారు. ఈ ఎన్ కౌంటర్ లో పాల్గొన్న పోలీస్ సబ్ ఇన్ స్పెక్టర్ సతీశ్ పాటిల్ కు తీవ్ర గాయాలయ్యాయి. ఘటన స్థలం నుంచి అనేక ఆటోమేటిక్ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఎన్ కౌంటర్ లో హతులైన మావోయిస్టుల్లో ఇద్దరు తెలుగు వాళ్లు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మధ్యాహ్నం 7 సీ60 కమాండో దళాలు వందోలి గ్రామం వద్ద నక్సల్స్ సమావేశం అయ్యారన్న సమాచారంతో కూంబింగ్ కు బయల్దేరాయి. ఈ సందర్భంగా సీ60 కమాండో బలగాలకు, మావోయిస్టులకు మధ్య దాదాపు ఆరు గంటలకు పైగా భీకర కాల్పులు జరిగాయి. కాగా, మృతి చెందిన వారిలో సీనియర్ డివిజనల్ కమిటీ మెంబర్ కూడా ఉన్నట్టు గుర్తించారు.

# ఇచ్చిన హామీని అమలు చేస్తున్నాం

(మొదటి పేజి తరువాయి)
ఇచ్చిన మాటకు కట్టుబడి ఆనాడు సోనియమ్మ తెలంగాణ ఇచ్చారని పేర్కొన్నారు. పార్టీకి నష్టమని తెలిసి కూడా సోనియా గాంధీ ఆనాడు సాహసోపేత నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గాంధీ కుటుంబం మాట ఇస్తే అది శిలాశాసనమే అన్నారు.
రైతు రుణమాఫీ చేస్తామని రాహుల్ గాంధీ మాట ఇచ్చారన్నారు. రాహుల్ గాంధీ మాట ఇచ్చారంటే అది చేసి తీరుతారన్న నమ్మకం కలిగించడం మన బాధ్యత అన్నారు. ఈ దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలవాలన్నారు.
వ్యవసాయ విధానంలో తెలంగాణ మోడల్‌ను దేశం అనుసరించేలా ఉండాలని పేర్కొన్నారు. తన జీవితంలో ఇది ఎప్పటికీ గుర్తుండిపోయే రోజు అన్నారు. రేపు సాయంత్రం 4 గంటలకు రూ.లక్ష వరకు ఉన్న రైతురుణాలు మాఫీ చేస్తున్నామన్నారు. రూ.7 వేల కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లోకి వెళతాయన్నారు. నెలాఖరులోగా రూ.లక్షన్నర వరకు ఉన్న రైతు రుణాలు మాఫీ చేస్తామన్నారు. ఆగస్ట్‌లో రూ.2 లక్షల వరకు రైతుల రుణమాఫీ చేసి రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ప్రతీ రైతును రుణ విముక్తి చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు.
కేసీఆర్ లాగా మాటలు చెప్పి మభ్యపెట్టడం లేదు
రుణమాఫీ పేరుతో కేసీఆర్ లాగా మాటలు చెప్పి రైతులను తాము మభ్యపెట్టడం లేదన్నారు. రైతు రుణమాఫీపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందన్నారు. అందుకే ఏకమొత్తంలో రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి చేస్తున్నామన్నారు. రైతు ఆత్మగౌరవాన్ని నిలబెట్టడానికే రూ.2 లక్షల రైతు రుణమాఫీ అని తెలిపారు.మనం చేస్తున్న మంచి పనిని ప్రజలకు వివరించాలని కేడర్‌కు ముఖ్యమంత్రి సూచించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. 'రుణమాఫీ హామీని నిలబెట్టుకున్నామని సగర్వంగా చెప్పండి..
రుణమాఫీపై జాతీయస్థాయిలో చర్చ జరగాలి' అన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఒకే విడతలో రూ.31 వేల కోట్లతో రుణమాఫీ చేయలేదన్నారు.
గ్యారెంటీని అమలు చేశామని పార్లమెంట్‌లో చెప్పండి
రాహుల్ గాంధీ ఇచ్చిన గ్యారెంటీని అమలు చేశామని పార్లమెంట్‌లో ఎంపీలు ప్రస్తావించాలని సూచించారు. రేపు గ్రామాల్లో, మండల కేంద్రాల్లో కూడలి నుంచి రైతు వేదికల వరకు బైక్ ర్యాలీలు నిర్వహించాలన్నారు. ఎమ్మెల్యేలు నియోజకవర్గ కేంద్రాల్లో కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. ఎక్కడికక్కడ ఒక పండగ వాతావరణంలో సంబరాలు జరపాలని... ఏడు నెలల్లో మన ప్రభుత్వం సంక్షేమానికి రూ.30 వేల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు.

# నీలపతాకా అమ్మవారిని ప్రజలు ఆరాధిస్తారు

## - దేవాలయకారి నిర్వహణ అధికారి కే. శేషు భారతి



వరంగల్, జులై 17,(జర్నలిస్ట్ వార్త):
వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవములు బుధవారం 12వ, రోజుకు చేరుకున్నాయి. ఆలయ కార్య నిర్వహణ అధికారి కే. శేషు భారతి, ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు తెలిపిన వివరాల మేరకు నిత్యాహ్నికం పూర్తిచేసిన పిమ్మట తిథిమండల దేవతా యజనంలో భాగంగా కాళీ క్రమాన్ననుసరించి, అమ్మవారి ఉత్సవ మూర్తులలో ఇచ్ఛాశక్తిని ఘనా గాను షోడశీ క్రమాన్ననుసరించి జ్ఞానశక్తిని నీలపతాకా నిత్యగాను అలంకరించి, పూజారాధనలు జరిపారు. దశమహావిద్యలలో అద్యవిద్యయైన కాళీ సపర్యా క్రమంలో ఏకాదశికి అధిదేవత ఘనా. ఘనా అమ్మవారు మేఘాలను రంజింపజేసి, వర్షింపజేస్తుంది. ఈ అమ్మవారిని అమృతవర్షిణి అనికూడా అంటారు. సకాలంలో వర్షాలు పడటానికి అతివృష్టి, అనావృష్టి లేకుండా సువృష్టి కలిగి సుభిక్షమవడానికి ఈమె అనుగ్రహం ప్రధానంగా కావాలి. నీలపతాకా అమ్మవారు వర్షాలను అడ్డుకునే అసురీ శక్తులను ధ్వంసం చేస్తుంది. ఈమె నీలవర్ణము కలిగిన పతాకమును కలిగియుంటుంది. ఆ పతాకమును చూచిన వెంటనే వర్షాలను అటంకపరిచే శక్తులు దూరంగా పారిపోతాయి. కాబట్టి నీలపతాకా అమ్మవారిని ప్రజలు బాగా ఆరాధిస్తారు. తొలి ఏకాదశి కావండంతో భక్తులు దేవాలయానికి అధిక సంఖ్యలో వచ్చారు. విష్ణుమూర్తి పాలకడలిలో శేష పాన్పుపై నాలుగు నెలల పాటు నిద్రిస్తాడు. ఈ సమయంలో విష్ణుమూర్తి సోదరియైన జగన్మాత ఈ నాలుగు నెలలు విష్ణుమూర్తి యొక్క పరిపాలనా బాధ్యతలు నెరవేరుస్తూ, ప్రజలకు సుఖసంతోషాలను కలిగిస్తుంది. అందుకే ఈ నాలుగు నెలల ఆస్తికులు, జగన్మాత పరివారాన్ని అనగా గణపతిని, శంకరుడిని, అమ్మవారిని ఇతోధికంగా ఆరాధిస్తారు. ఈ నాలుగు నెలలు ఎక్కడ చూసినా భగవదారాధన ఎక్కువగా ఉంటుందని తెలిపారు.

# గత ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేసిన పాపాన పోలే



అనంతగిరి జులై 17,(జర్నలిస్ట్ వార్త):
రైతులు సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన సాగుతుందని అనంతగిరి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్ రెడ్డి, అన్నారు. బుధవారం విలేకరులతో వారు మాట్లాడుతూ గతంలో బారాస ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసిన పాపాన పోలేదని చెప్పారు. రెండు పర్యాయాలు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన విడతలవారీగా ఇవ్వడంతో వడ్డీ మాపి అమలు కార్యక్రమంగా మిగిలి పోయిందన్నారు. రేషన్ కార్డు ఫ్యామిలీ యూనిట్ గుర్తింపు కోసమే అని ప్రభుత్వం పేర్కొంటున్న ప్రతిపక్షాలు అయోమయానికి గురి చేస్తున్నాయన్నారు. గత ప్రభుత్వం హయాంలో ప్రకృతి వైపరీత్యాలకు చిడపురుగులతో పంట నష్టపోయిన రైతులను ఆదుకున్న దాఖలాలు లేవన్నారు. సన్న రకం ధాన్యం పండించే రైతులను ప్రోత్సహించేందుకు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అన్నారు. మండల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసేలా సహకరించాలని ఇటీవల మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి కలిసి కోరినట్లు పేర్కొన్నారు.

## ఐనవోలు మల్లికార్జున స్వామి దేవాలయంలో

# తొలిఏకాదశి పండుగ వేడుకలు...





వర్ధన్నపేట జులై 17,(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన దేవాలయాల్లో ఒకటైన మల్లికార్జున స్వామి దేవాలయంలో బుధవారం తొలి ఏకాదశి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 5 నుండి సాయంత్రం 7 వరకు మహాగణపతి పూజ, మహాన్యాసక పూర్వక రుద్రాభిషేకం కార్యక్రమం నిర్వహించినట్లు దేవాలయ కార్య నిర్వహణ అధికారి అద్దంకి నాగేశ్వర్ రావు తెలిపారు. గత సంవత్సరం మాదిరిగా ఆకేరు వాగు నుండి కొత్త జలాలను అర్చక స్వాముల వేద మంత్రోచ్ఛరణతో తీసుకువచ్చి, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేయడం జరిగిందన్నారు. ఉదయం 7 గంటల సమయం నుండి 12 వరకు గ్రామస్థులు బిందెలతో నీరు తెచ్చి, లింగానికి అభిషేకం చేశారు. ఉదయం 7 గంటల నుండి అమ్మవారు శాకాంబరీ అలంకరణలో(వివిధ కూరగాయల అలంకరణతో) దర్శనమిచారు. తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు దంపతులు, పలువురు నాయకులు, గ్రామస్తులు స్వామి వారిని, అమ్మ వార్లను దర్శించుకొన్నారు.
ఈ కార్యక్రమంలో దేవాలయ ఉప ప్రధాన అర్చకులు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్, ఐనవోలు మధుకర్ శర్మ, వేద పారాయణ



గట్టు పురుషోత్తం శర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, అర్చక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రూపాయి రూపాయి పోగుచేసి ఈ కార్యక్రమం చేపట్టాం

## : తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



తెలంగాణలో రేపటి నుంచి రుణ మాఫీ అమలు కానున్న సంగతి తెలిసిందే. దీనిపై తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రజాభవన్ లో మాట్లాడారు. రుణ మాఫీ కార్యక్రమం అమలుకు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం అమలు కోసం నిద్రలేని రాత్రులు గడిపామని, రూపాయి రూపాయి పోగు చేసి ఈ కార్యక్రమం చేపట్టామని వెల్లడించారు. అన్ని కుటుంబాలకు రుణమాఫీ చేస్తామని, రేషన్ కార్డులు లేని ఆరు లక్షల రైతు కుటుంబాలకు రుణ మాఫీ చేస్తున్నామని చెప్పారు. ఆగస్టు నెల దాటేలోపు రుణమాఫీ పూర్తి చేస్తామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రుణ మాఫీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నేతలు ప్రతి ఓటర్ వద్దకు తీసుకెళ్లాలని, తలెత్తుకుని ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం రూ.1 లక్ష రుణమాఫీని రూ.25 వేల చొప్పున నాలుగు విడతల్లో పూర్తి చేసిందని... తాము రెండు లక్షల రుణమాఫీని నెల వ్యవధిలోనే అమలు చేస్తున్నామని భట్టి వివరించారు. ఏడు లక్షల కోట్ల అప్పుతో అధికారం చేపట్టినప్పటికీ, ఇచ్చిన హామీలపై ఎక్కడా వెనక్కి తగ్గడంలేదని అన్నారు.

# సింగరేణిలో విషాదం

## కప్పు కూలి ఇద్దరు దుర్మరణం

### ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటాం : సింగరేణి సంస్థ సిఎండి బలరామ్



**రామగుండంజులై 17,(జర్నలిస్ట్ వార్త):**
సైడ్ కప్పు కూలి ఇద్దరు సింగరేణి కార్మికులు మృత్యువాత పడిన సంఘటన పెద్దపల్లి జిల్లా రామగుండం లోని సింగరేణి ఓసిపి 2 లో గని బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వాటర్ పైప్ లైన్ మరమ్మత్తులు చేస్తుండగా సైడ్ పై కప్పు ఒక్కసారిగా కూలడంతో కార్మికులు అందులో ఇరుక్కుపోయి శ్వాస ఆడక మృతి చెందారు.ఫిట్టర్ ఉప్పు వెంకటేశ్వర్లు, జనరల్ మజ్దూర్ సాగర్ లు మృతి చెందారు. మృతదేహాలను వెలికి తీసి గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలిస్తున్నారు. కార్మికులు మృతి చెందడంతో ఓసిపి 2 లో విషాద ఛాయలు అలుముకున్నాయి.3 ఏరియాలోని ఓపెన్ కాస్ట్ -2 గనిలో జరిగిన ప్రమాద దుర్ఘటనలో ఇద్దరు కార్మికులు ఫిట్టర్ ఉప్పు వెంకటేశ్వర్లు , జనరల్ మజ్దూర్ విద్యా సాగర్ మృతి చెందడం పై సింగరేణి సంస్థ ఛైర్మన్ , ఎండి ఎన్.బలరామ్ తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.వారి కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామని ప్రకటించారు. ఇటువంటి ప్రమాదాలు భవిష్యత్ లో జరగకుండా పటిష్టమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అన్ని స్థాయిల అధికారులను, ఉద్యోగులను ఆదేశించారు. అలాగే ఈ ప్రమాద సంఘటనపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించారు.

# భూ భ్రమణం మారుతోంది..




### కొత్త అధ్యయనంలో సంచలనాలు

### భూగ్రహంపై తీవ్ర ప్రభావం చూపుతున్న వాతావరణ మార్పులు

### స్విట్జర్లాండ్‌లోని ఈటీహెచ్ జ్యూరిచ్ యూనివర్సిటీ నూతన పరిశోధనలో

**హైదరాబాద్ జులై 17,(జర్నలిస్ట్ వార్త):**
మానవ ప్రేరేపిత వాతావరణ మార్పులు భూగ్రహాన్ని ప్రభావితం చేస్తున్నాయి. అనేక మార్పులకు కారణమవుతున్నాయి. ఏకంగా భూ భ్రమణం మారుతోందని నూతన అధ్యయనం వెల్లడించింది. వాతావరణ మార్పు భూమి అక్షం మార్పునకు కూడా దారితీస్తోందని స్విట్జర్లాండ్‌లోని ఈటీహెచ్ జ్యూరిచ్ యూనివర్సిటీ నూతన పరిశోధన పేర్కొంది. ధ్రువపు మంచు కరుగుతోందని, ఈ నీరు భూమధ్యరేఖ వైపు ప్రవహిస్తోందని, పర్యవసానంగా భూగ్రహం ద్రవ్యరాశి పంపిణీ జరుగుతోందని, గ్రహం భ్రమణ వేగాన్ని తగ్గిస్తోందని అధ్యయనం పేర్కొంది. పగటి సమయం కాస్త ఎక్కువగా ఉండేందుకు ఈ పరిణామం దారితీస్తుందని వివరించింది. ఈ మేరకు 'నేచర్ జియోసైన్స్'లో అధ్యయనాన్ని ప్రచురించింది.



కాగా ఈ నూతన అధ్యయనానికి నాయకత్వం వహించిన ప్రొఫెసర్ బెనెడిక్ట్ సోజా స్పందిస్తూ.. వ్యక్తులు తమ చేతిని చాచి తిప్పుతున్న సదృశ్యానికి ఉదాహరణగా వివరించారు. భూమి ద్రవ్యరాశి అక్షం నుంచి దూరంగా కదిలినప్పుడు భ్రమణ వేగం పెరుగుతుందని, ద్రవ్యరాశి రివర్స్‌లో పంపిణీ అయినప్పుడు భ్రమణం నెమ్మదిస్తుందని వివరించారు.సాధారణంగా చంద్రుడి భ్రమణం కారణంగా భూమిపై పగలు, రాత్రి ఏర్పడుతుంటాయి. అయితే మనుషులు కర్బన ఉద్గారాలను ఇదే స్థాయిలో నిరంతరాయంగా కొనసాగిస్తే వాతావరణ మార్పులు చంద్రుడి ప్రభావాన్ని కూడా అధిగమించి ప్రభావం చూపగలవని పరిశోధకులు గుర్తించారు. వాతావరణ మార్పులు తీవ్రమైన ప్రభావం చూపించే అవకాశం ఉందని బెనెడిక్ట్ సోజా హెచ్చరించారు. వాతావరణ మార్పులు భూగ్రహంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తాయని అన్నారు.

# అమెరికా ఎన్నికల్లో తెలుగు అడుగులు

**జులై 17,(జర్నలిస్ట్ వార్త):**
**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అంచనాలన్నీ నిజమైతే ఓ తెలుగింటి అమ్మాయి.. ఆ దేశ రెండో మహిళగా నిలుస్తారు. రిపబ్లికన్ పార్టీ తరఫున అమెరికా ఉపాధ్యక్ష అభ్యర్థిగా ఎంపికైన జె.డి.వాన్స్ భార్య, ఉషా చిలుకూరి వాన్స్ తెలుగు మూలాలున్న మహిళ. రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, వాన్స్ పేరు ప్రకటించగానే.. ఆయన భార్య ఉష గురించి కూడా ఎక్కువగా చర్చిస్తున్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఇప్పుడు కొత్తగా వినిపిస్తున్న పేరు ఉషా చిలుకూరి వాన్స్. పేరు చూస్తే తెలుగు మూలాలున్నమహిళగా అర్థమవుతోంది. అమెరికా అధ్యక్ష పదవికి రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న డోనాల్డ్ ట్రంప్ తన డిప్యూటీగా 39 ఏళ్ల జేడీ వాన్స్ పేరును సోమవారం అనౌన్స్ చేశారు. రిపబ్లికన్ పార్టీ తరుపున డోనాల్డ్ ట్రంప్ అధికారిక అభ్యర్థిగా పోటీ పడుతున్నారు. మిల్వాకీలో జరిగిన పార్టీ కన్వెన్షన్‌లో ఆయన వాన్స్ పేరును స్వయంగా అనౌన్స్ చేశారు. తనపై హత్యాయత్నం తర్వాత ట్రంప్ పాల్గొన్న మొదటి కార్యక్రమం ఇదే. వాన్స్ పేరును అనౌన్స్ చేసినప్పుడు ఉషా అక్కడే ఉన్నారు. డోనాల్డ్ ట్రంప్ జె.డి.వాన్స్ పేరు ప్రకటించిన తర్వాత ఆడిటోరియం అంతా మార్మోగిపోయింది. ఓహియోకు ప్రాతినిధ్యం వహిస్తున్న వాన్స్ పెద్దగా రాజకీయ అనుభవం ఉన్నవారు కాదు. తొలిసారి ఆయన సెనేటర్ అయ్యారు. పైగా ట్రంప్ ఆంతరంగిక బృందంలోని వాడు కూడా కాదు. కానీ వయసులో పెద్ద అయిన ట్రంప్ తన టీమ్‌కు యంగ్ లుక్ ఇవ్వడం కోసం 39 ఏళ్ల వాన్‌ను ఎంపిక చేశారు. అయితే వాన్ పేరు బయటకు వచ్చాక ఆయనతో పాటే ఆయన భార్య ఉషా చిలుకూరి వాన్స్ పేరు కూడా ఎక్కువ చర్చలోకి వచ్చింది. ప్రఖ్యాత పత్రికతో పాటు అన్ని చానెల్స్ వంటివన్నీ ఆమె గురించి చర్చించడం మొదలుపెట్టాయి. జెడి వాన్ రాజకీయ గమనానికి ఆమే ముఖ్య కారణం. అమెరికా ఉపాధ్యక్ష అభ్యర్థి ఇప్పుడు తెలుగింటి అల్లుడు. రిపబ్లికన్ పార్టీకి ఉన్న గెలుపు అవకాశాల దృష్ట్యా ఆయనే ఉపాధ్యక్షుడు అయ్యే అవకాశం ఉంది. అలా అయితే సెకండ్ లేడీగా నిలుస్తారు. ఇప్పుడు అమెరికాలోనే కాదు.. మన ఆంధ్రా, తెలంగాణలో కూడా ఇదే ఎక్కువగా నడుస్తోంది. అమెరికా ఉపాధ్యక్ష అభ్యర్థి ప్రకటన తర్వాత ఆమె గురించి తెలుసుకునేందుకు గూగుల్‌ను, తెగ వెతికేస్తున్నారు. ఉషా చిలుకూరి తెలుగు మూలాలున్న అమెరికన్. ఆమె తల్లిదండ్రులు ఆంధ్రప్రదేశ్ నుంచి కాలిఫోర్నియా వెళ్లి వెళ్లి స్థిరపడ్డారు. ఆ రాష్ట్రంలోని శాన్‌డియాగోలోనే ఉష పుట్టి పెరిగారు. ప్రఖ్యాత యేలా యూనివర్శిటీ 2010-13 వరకూ చదివి న్యాయ శాస్త్ర పట్టా పుచ్చుకున్నారు. అక్కడే ఆమెకు



జెడి వాన్స్ పరిచయం. 2014లో వారిద్దరి వివాహం జరిగింది.
2015లో ఉష... లా ఫర్మ్‌లో అసోసియేట్‌గా ఉద్యోగం ప్రారంభించారు. ఆ తర్వాత 2018లో కేంబ్రిడ్జ్ నుంచిఎంఫిల్ చేసిన ఆమె సుప్రీంకోర్టులో లా క్లర్క్‌గా పనిచేశారు. అత్యున్నత న్యాయస్థానంలో ఇది ముఖ్యమైన పొజిషన్. ఉన్నత విద్య, టెక్నాలజీ, స్థానిక ప్రభుత్వాలకు సంబంధించిన వ్యాజ్యాల్లో ఆమెకి మంచి పేరు ఉంది. సుప్రీంకోర్టులో పనిచేసిన తర్వాత మళ్లీ బయటకు వచ్చి పాత కంపెనీలోనే ఉద్యోగం చేస్తూ వచ్చిన ఆమె... తన భర్త పేరు అనౌన్స్ చేసిన తర్వాత రాజీనామా చేశారు. భర్తతో వైవాహిక బంధం పంచుకోవడం మాత్రమే కాదు.. ఆయన్ను రాజకీయాల వైపు నడిపించడంలోనూ ఉషదే ముఖ్య పాత్ర. యేల్స్‌లో ఉన్నప్పటి నుంచే అనేక సామాజిక అంశాలపై వీళ్లిద్దరూ పరిశోధనలు చేసేవారు. అతన్ని రాజకీయాల వైపు ఓ విధంగా ఆమెనే ప్రోత్సహించారు. ఈ విషయాన్ని జెడీ వాన్స్ పలు ఇంటర్వ్యూల్లో చెప్పారు. తనని ఎప్పుడూ అంటూ అందరికీ పరిచయం చేస్తుంటారు. అంటే తనని నడిపించిన స్ఫూర్తి ఆమె అని ఆయన పలు సందర్భాల్లో చెప్పారు. తన జీవిత అనుభవాలతో ఆయన అనే బుక్ కూడా రాశారు. ఇది ఆ తర్వాత మూవీగా కూడా వచ్చింది. 2016లో వాన్స్ మొదటి సారి సెనేటర్‌గా పోటీ చేసినప్పుడు ఆమె తన భర్త వెంట పొలిటికల్ ర్యాలీల్లో తిరిగారు. అతని రాజకీయ నిర్ణయాలన్నింటికీ మద్దతుగా నిలిచారు. ఉష హిందూ, వాన్స్ కాథలిక్ క్రిష్టియన్. వీరిద్దరి వివాహం హిందూ సాంప్రదాయ పద్ధతిలో జరిగిందని సమాచారం. ఉష కుటుంబం గురించి ఇంకా పూర్తి వివరాలు తెలియడం లేదు. ఆమె తెలుగు మూలాలున్న వ్యక్తి అని తెలుస్తున్నా పూర్తి వివరాలు ఎక్కడ అని తెలుసుకునేందుకు ఏబీపీ దేశం ప్రయత్నించింది. అమెరికాలోని ఎన్ఆర్ఐలు కూడా ఇప్పుడే ఆమె గురించి సమాచారం సేకరిస్తున్నారు. "యు.ఎస్‌లో రెండు పూల్స్ ఉంటాయి. కొత్తగా అక్కడికి వెళ్లిన యువకులు.. 30-40 ఏళ్ల క్రితం అక్కడకి వెళ్లిన ముందు తరాల వారు. కానీ ఉష కుటుంబం చాలా కాలం క్రితమే కాలిఫోర్నియా వెళ్లిపోయింది. ఆమె సుప్రీంకోర్టులో బెంచ్ క్లర్క్‌గా చేశారు అంటేనే ఆమె స్థాయి ఏంటో అర్థం అవుతోంది. లీగల్ డిపార్ట్‌మెంట్‌లో దేశం మొత్తం మీద ఉన్న 5-6 పెద్ద పొజిషన్లలో అదొక్కటి. కాబట్టి ఆమె లీగ్ పూర్తిగా వేరు. మన తెలుగు వాళ్లు కూడా ఇప్పుడే తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. రెండు రోజుల్లో పూర్తి వివరాలు రావొచ్చు" అని ఏపీ నాన్ రెసిడెంట్ ఫోరమ్ ంఖఔఖీ పూర్వ అధ్యక్షుడు రవి వేమూరి తెలిపారు. అధ్యక్ష అభ్యర్థి ట్రంప్ వయసులో సగం ఉన్న జేడీ వాన్స్ ఇప్పుడు రిపబ్లికన్ పార్టీకి యువతరం ప్రతినిధి. అతను అమెరికాలోని దిగువ మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన శ్వేతజాతి యువకుడు. సొంతంగా తన కష్టంతో ఎదిగినవాడు. ఉష.. ఆయన ప్రతి అడుగులోనూ వెన్నంటి నిలిచిన అదృశ్య శక్తి. అందుకే అమెరికన్ పత్రికలు ఇప్పుడు ఆమె గురించి కూడా ఎక్కువగా చర్చిస్తున్నాయి.

## బడ్జెట్ సన్నాహాలు...




**హైదరాబాద్ జులై 17,(జర్నలిస్ట్ వార్త):**
ఎన్డీయే 3.0 ప్రభుత్వం వచ్చాక తొలిసారి పూర్తి స్థాయి పార్లమెంటు సమావేశాలు జులై 22 నుంచి ఆగస్టు 12 వరకు నిర్వహించనున్నారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ జులై 23న పార్లమెంటులో కేంద్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్-2024 సన్నాహాలు తుది దశకు చేరుకున్న నేపథ్యంలో, సంప్రదాయం ప్రకారం పార్లమెంటులో నిర్మలా సీతారామన్ హల్వా తయారుచేశారు. ఆర్థిక శాఖ అధికారులకు, పార్లమెంటు సిబ్బందికి ఆమె స్వయంగా హల్వాను వడ్డించారు. ఈ కార్యక్రమం పార్లమెంటు నార్త్ బ్లాక్ లో నిర్వహించారు.


## బ్యాంక్ సర్వర్ హ్యాక్ చేసి రూ. 16.71 కోట్లు కొట్టేశారు



**హైదరాబాద్ జులై 17,(జర్నలిస్ట్ వార్త):**
సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతూ ఆన్‌లైన్ వేదికగా చెలరేగుతూ అమాయకులను అడ్డంగా దోచేస్తుండగా తాజాగా భారీ స్కామ్‌కు స్కెచ్ వేశారు. నోయిడా సెక్టార్ 62లో నైనిటాల్ బ్యాంక్ లిమిటెడ్ బ్రాంచ్ సర్వర్‌ను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు రూ. 16.71 కోట్లు కొట్టేశారు. బ్యాంక్ బ్యాలెన్స్ షీట్‌ను తనిఖీ చేసే క్రమంలో బ్యాంక్ ఐటీ మేనేజర్ సుమిత్ శ్రీవాస్తవ ఈ దోపిడీని ఇటీవల గుర్తించారు. ఆపై దర్యాప్తులో బ్యాంక్ సర్వర్ హ్యాక్ అయిందని వెల్లడైంది. జూన్ 17 నుంచి జూన్ 21 మధ్య ఈ డబ్బును 84 వేర్వేరు ఖాతాలకు ట్రాన్స్ ఫర్ అయినట్టుగా గుర్తించారు. దోపిడీని గుర్తించిన వెంటనే శ్రీవాస్తవ నోయిడా సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో జులై 10న ఫిర్యాదు చేశారు. ఈ దోపిడీపై తదుపరి దర్యాప్తు విషయంలో బ్యాంక్ ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం సాయాన్ని కూడా కోరింది. ఎన్సీఆర్‌బీ పోర్టల్‌లో ఇప్పటికే ఫిర్యాదు నమోదవగా, ఎఫ్ఐఆర్ మాత్రం జులై 10న నమోదైందని ఎస్‌హెచ్ఓ ఉమేష్ చంద్ర నైతాని వెల్లడించారు. సైబర్ నేరగాళ్లు బ్యాంక్ మేనేజర్ లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌లను దొంగిలించి చోరీ చేసిన నిధులను 89 వేర్వేరు బ్యాంక్ ఖాతాలకు బదలాయించారని సైబర్ నోయిడా ఏసీపీ వివేక్ రంజన్ రాయ్ వివరించారు.

## హరియాణలో కొలువుతీరనున్న కాంగ్రెస్ సర్కార్

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో హరియాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆ పార్టీ నేత, హరియాణ మాజీ సీఎం భూపీందర్ సింగ్ హుడా స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీజేపీ సర్కార్ ఉపాధి కల్పనలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. గత పదేండ్లుగా రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని దుయ్యబట్టారు. నైనీ సర్కార్ అన్ని రంగాల్లో విఫలమైందని, రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని భూపీందర్ సింగ్ పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టేలా తాము త్వరలో ఎన్నికల మేనిఫెస్టోకు రూపకల్పన చేస్తామని చెప్పారు. రానున్న హరియాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, జేజేఎం సర్కార్‌కు ప్రజలు చరమగీతం పాడి, కాంగ్రెస్ సర్కార్‌ను కొలువుతీర్చుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాగా, విపక్షాలను ఉద్దేశించి కేంద్ర మంత్రి, హరియాణ మాజీ సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ కీలక వ్యాఖ్యలు చేశారు. విపక్షం 99 మార్కులు తెచ్చుకున్న విద్యార్థిలా సంబరపడుతున్నదని, కానీ



వారికి 543కు 99 వచ్చాయని గుర్తుపెట్టుకోవాలని అన్నారు. అయితే కాంగ్రెస్ ఒక విషయానికి సంతోషపడాలని అనడంతో తాను ఏకీభవిస్తానని చెప్పారు. 2014లో వారికి కేవలం 44 సీట్లు దక్కగా, 2019లో 52 స్థానాలు వచ్చాయని, ఈసారి వారికి కనీసం ప్రతిపక్ష హోదా దక్కిందని వ్యాఖ్యానించారు.

## ఈనెల 21న అఖిలపక్ష సమావేశం.. హాజరుకావడం లేదన్న తృణమూల్ కాంగ్రెస్

**హైదరాబాద్ జులై 17,(జర్నలిస్ట్ వార్త):**
పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 22న ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఆగస్టు 12 వరకు జరిగే ఈ సమావేశాల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల 23న పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం ఆల్ పార్టీ మీటింగ్‌కు ఆహ్వానించింది. జూలై 21న కేంద్రం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. పార్లమెంట్ ఉభయసభల్లోని అన్ని రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లను బడ్జెట్ సెషన్, సభా వ్యవహారాలపై చర్చించేందుకు కేంద్రం సమావేశానికి ఆహ్వానించింది. సభ సజావుగా



సాగడంతో పాటు ముఖ్యమైన అంశాలపై భేటీలో చర్చించే అవకాశం ఉన్నది. అయితే ఈ సమావేశానికి తృణమూల్ కాంగ్రెస్ హాజరు కావడం లేదు. జులై 21న రాష్ట్ర అమరవీరుల దినోత్సవం నేపథ్యంలో ఈ సమావేశానికి హాజరుకావడం లేదని టీఎంసీ వర్గాలు తెలిపాయి. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈ ఏడాది ఫిబ్రవరిలో మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఎన్నికల అనంతరం పూర్తిస్థాయిలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్లు ప్రభుత్వం అప్పట్లో తెలిపింది. ఈ నేపథ్యంలోనే కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో 2024-25 సంవత్సరానికి సంబంధించి పూర్తి స్థాయి బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సభలో ప్రవేశ పెట్టనున్నారు. ఇక ఈ సమావేశాలు జూలై 22న ప్రారంభమై ఆగస్టు 12న ముగుస్తాయి. జూలై 23న బడ్జెట్‌ను సమర్పించనున్నారు.

**నిర్మలమ్మ సరికొత్త రికార్డు..**
ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ సరికొత్త రికార్డ్ నెలకొల్పనున్నారు. వరుసగా రెండోసారి ఆర్థిక మంత్రిగా ఎన్నికైన ఆమె.. 2024-25 బడ్జెట్‌ను సమర్పించనున్నారు. అయితే, వరుసగా ఆరుసార్లు బడ్జెట్‌లను సమర్పించిన మాజీ ఆర్థిక మంత్రి మొరార్జీ దేశాయ్‌ని అధిగమించనున్నారు. మొరార్జీ దేశాయ్ వరుసగా ఆరుసార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈసారి కేంద్ర ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెడితే.. వరుసగా ఏడు కేంద్ర బడ్జెట్‌లను సమర్పించిన ఆర్థిక మంత్రిగా ఆమె సరికొత్త రికార్డ్ క్రియేట్ చేయనున్నారు.
కాగా, మోదీ తొలి విడుత మంత్రి వర్గంలో (2014) పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రిగా నిర్మలా సీతారామన్ బాధ్యతలు చేపట్టారు. 2017లో కీలకమైన రక్షణ శాఖ బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత 2019లో రెండోసారి ప్రధాని మోదీ ఎన్నికైన తర్వాత ఏర్పాటైన కేంద్ర మంత్రి వర్గంలోనూ చోటు దక్కించుకున్న నిర్మలా సీతారామన్‌కు అత్యంత కీలకమైన ఆర్థికశాఖను అప్పగించారు నరేంద్రమోదీ. నాటి నుంచి దేశీయ ఆర్థిక రంగంలో మలి విడుత ఆర్థిక సంస్కరణలను పరుగులెత్తించారు. కేంద్ర మంత్రివర్గంలో మూడోసారి వరుసగా చోటు దక్కించుకున్న ఏకైక మహిళా నాయకురాలిగా నిర్మలా సీతారామన్ రికార్డు నెలకొల్పారు.

## ఉగ్రదాడులకు పాల్పడేవారికి దీటుగా బదులిస్తాం




జమ్ము కశ్మీర్‌లోని దోడాలో జరిగిన ఉగ్రదాడిలో నలుగురు జవాన్లు మరణించిన ఘటనపై బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ స్పందించారు. ఉగ్ర దాడులకు పాల్పడే వారిపై గతంలో కఠిన చర్యలు చేపట్టడం జరిగిందని, ఇప్పుడు కూడా ఉగ్ర మూకను అలాగే అణిచివేస్తామని అన్నారు. జమ్ము కశ్మీర్‌లో కొందరు శాంతిని భగ్నం చేయాలనుకుంటు న్నారని చెప్పారు. కానీ అలాంటి ఘటనలకు మన భద్రతా దళాలు దీటుగా బదులిస్తాయని ఆయన హెచ్చరించారు. కాగా, దోడా జిల్లాలోని దెసా అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారనే సమాచారంతో భారత సైన్యం, స్థానిక పోలీసులు సోమవారం రాత్రి 7.45 గంటలకు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో టెర్రరిస్టులు, భద్రతాసిబ్బందికి మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో నలుగురు ఆర్మీ సిబ్బందితోపాటు పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని దవాఖానకు తరలించగా ఆర్మీ అధికారితోపాటు మరో ముగ్గురు జవాన్లు మరణించారని అధికారులు తెలిపారు. రాత్రి 9 గంటల సమయంలో ఎన్‌కౌంటర్ ప్రారంభమైందని, భారీ కాల్పులు జరిగాయని ఇండియన్ ఆర్మీ ఎక్స్ వేదికగా ప్రకటించింది. 20 నిమిషాలకుపైగా కాల్పులు జరిగాయని పేర్కొంది. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని వెల్లడించారు. ఆపరేషన్ ఇంకా కొనసాగుతున్నదని అధికారులు తెలిపారు. ఈ దాడికి పాల్పడింది తామేనని పాకిస్థాన్ ఉగ్రసంస్థ జైషే మహమ్మద్‌కు చెందిన కశ్మీర్ టైగర్ ప్రకటించింది.

## కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు బిభవ్ కుమార్‌పై చార్జిషీటు



**న్యూఢిల్లీ:** ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్‌పై దాడి కేసు మరో కీలక మలుపు తిరిగింది. ఈ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు బిభవ్ కుమార్‌పై ఢిల్లీ పోలీసులు మంగళవారంనాడు తీస్ హజారీ కోర్టులో ఛార్జిషీటు నమోదు చేశారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న కోర్టు బిభవ్ కుమార్‌ను ఈనెల 30న భౌతికంగా తమ ముందు హాజరు పరచాలని ఆదేశించింది. జూలై 30వ తేదీ వరకూ ఆయన జ్యుడిషియల్ కస్టడీని పొడిగించింది. బిభవ్‌కుమార్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈరోజు కోర్టు ముందు హాజరుపరిచారు. ఢిల్లీ పోలీసులు 1,000 పేజీల ఛార్జిషీటును నమోదు చేసినట్టు తెలుస్తోంది. సీఎం నివాసం నుంచి డీవీఆర్, బిభవ్‌కు చెందిన రెంబు మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. మే 13న కేజ్రీవాల్‌ను కలుసుకునేందుకు ఆయన నివాసానికి వెళ్లినప్పుడు బిభవ్ తనపై దాడి చేసినట్టు స్వాతి మలివాల్ ఇటీవల కేసు పెట్టారు. దీంతో మే 19న ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. ఆయన దాఖలు చేసుకున్న బెయిలును ఢిల్లీ హైకోర్టు జూలై 12న తోసిపుచ్చింది. దీంతో బిభవ్ జ్యుడిషియల్ రిమాండ్‌లో కొనసాగుతున్నారు.

## హెచ్ఐవీ నిర్మూలనకు సూది మందు




**హైదరాబాద్ జులై 17,(జర్నలిస్ట్ వార్త):**
హెచ్ఐవీ ఇన్ఫెక్షన్ నుంచి మనుషులను కాపాడేందుకు తయారు చేసిన సూది మందు పరీక్షలు విజయవంతమయ్యాయి. దక్షిణాఫ్రికా, ఉగాండాలలో నిర్వహించిన క్లినికల్ ట్రయల్స్ సత్ఫలితాలను చూపించాయి. లెనకపవిర్ ఇంజెక్షన్‌ను ఆరు నెలలకు ఒకసారి చొప్పున, ఏడాదికి రెండుసార్లు ఇవ్వడంవల్ల యువతులను హెచ్ఐవీ నుంచి కాపాడవచ్చని ఈ పరీక్షల్లో స్పష్టమైంది. రోజువారీ మాత్రల రూపంలో ఉన్న ఇతర హెచ్ఐవీ ఔషధాల కన్నా లెనకపవిర్ ఇంజెక్షన్ మెరుగైనదా.. కాదా..? అనే అంశాన్ని ఈ పరీక్షల్లో విశ్లేషించారు. ఈ మూడు ఔషధాలు ప్రీ-ఎక్స్‌పోజర్ ప్రొఫిలాక్సిస్ (పీఆర్ఈపీ) డ్రగ్స్ అని పరిశోధకులు తెలిపారు. ఈ ఇంజెక్షన్‌ను అందరికీ అందుబాటులోకి తేవడానికి ప్రయత్నిస్తున్నట్లు గిలీడ్ సైన్సెస్ ఓ ప్రకటనలో తెలిపింది.

## మళ్లీ ఢిల్లీకి రైతుల ర్యాలీ..



**ఛండీగఢ్:** హర్యానా, పంజాబ్‌లను వేరుచేస్తూ శంభు సరిహద్దులో ఏర్పాటు చేసిన దిగ్బంధాలను హర్యానా ప్రభుత్వం తొలగించడంతో మరోసారి రైతులు ఢిల్లీకి ర్యాలీ చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. జంతర్‌మంతర్‌లో కానీ, రామ్‌లీలా మైదానంలో కానీ శాంతియుత నిరసనలకు దిగుతామని భారతీయ కిసాన్ యూనియన్ అధ్యక్షుడు జగ్జీత్ సింగ్ దలేవాల్ మంగళవారం తెలిపారు. పండించిన పంటలకు కనీస మద్దతు ధర హామీ ఇవ్వడంతో సహా పలు డిమాండ్లపై రైతులు గత కొన్నాళ్లుగా నిరసలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గత ఫిబ్రవరిలో చేపట్టిన 'ఛలో ఢిల్లీ' కార్యక్రమాన్ని భద్రతా బలగాలు అడ్డుకోవడంతో అప్పటి నుంచి హర్యానా సరిహద్దుల్లోనే రైతులు బస చేస్తున్నారు. ఘర్షణల క్రమంలో శింబు సరిహద్దు వద్ద అధికారులు రోడ్లు మూసివేసి రాకపోకలను నిలిపి వేశారు. ఈ నేపథ్యంలో సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించాలని పంజాబ్ హర్యానా హైకోర్టు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలిచ్చింది. ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు కలిగించవద్దని పేర్కొంది. అయితే, శాంతిభద్ర తల పరిస్థితిని ఉటంకిస్తూ కోర్టు ఆదేశాలపై హర్యానా ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

**మళ్లీ ఆపితే ప్రభుత్వానిదే బాధ్యత..**
కాగా, ఈసారి తమను అడ్డుకున్నా, రహదారులపై బారికేడ్లు ఏర్పాటు చేసిన హర్యానా ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని జగ్జీత్ సింగ్ దలేవాల్ తెలిపారు. రైతు నిరసనలపై గత మార్చిలో అరెస్టు చేసిన నవదీప్‌సింగ్‌కు సంఘీబావంగా బుధవారం నాడు శాంతియుత నిరసన తెలుపుతామని చెప్పారు. ఫిబ్రవరిలో రైతులు, భద్రతా బలగాలకు మధ్య తలెత్తిన ఘర్షణల్లో బటిండాకు చెందిన 21 ఏళ్ల యువరైతు సుభ్‌కరణ్ సింగ్ పంజాబ్-హర్యానా సరిహద్దుల్లోని ఖనౌరి వద్ద ప్రాణాలు కోల్పోయాడు.

# రామ్ చరణ్ – రైమ్.. కాంబినేషన్ లో..



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కి 'ఆర్ఆర్ఆర్' తో దేశ వ్యాప్తంగా విశేషమైన గుర్తింపు లభించింది. నార్త్ ఇండియన్ ఆడియన్స్ రామ్ చరణ్ పెర్ఫార్మెన్స్ కి ఫిదా అయిపోయారు. గతంలో చరణ్ హిందీలోచేసిన 'జంజీర్' డిజాస్టర్ అయ్యింది. ఆ సినిమా సమయంలో యాక్టింగ్ పరంగా విమర్శలు ఎదుర్కొన్నాడు. అయితే 'ఆర్ఆర్ఆర్' మాత్రం ఆయన ఇమేజ్ ని అమాంతం పెంచేసింది. ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో 'గేమ్ చేంజర్' షూటింగ్ రామ్ చరణ్ పూర్తి చేశాడు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో RC16 సినిమా కోసం చరణ్ సిద్ధం అవుతున్నారు. ఈ క్యారెక్టర్ లుక్ కోసం చరణ్ ప్రత్యేకంగా మేకోవర్ అవుతున్నట్లు తెలుస్తోంది. ఆగష్టు నెలాఖరులో లేదంటే సెప్టెంబర్ లో ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ కావొచ్చు. ఇదిలా ఉంటే ఇండియన్ సెలబ్రెటీలకి లండన్ లో మేడమ్ టుస్సాడ్ లో మైనపు విగ్రహాలు పెట్టడం ఎప్పటి నుంచో జరుగుతోంది. ఇప్పటికే టాలీవుడ్ స్టార్స్ అయిన సూపర్ స్టార్ మహేష్ బాబు, డార్లింగ్ ప్రభాస్ మైనపు విగ్రహాలు మేడమ్ టుస్సాడ్ మ్యూజియంలో పెట్టారు. ఇప్పుడు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ మైనపు విగ్రహం కూడా పెట్టబోతున్నారంట. ఇదంతా బాగానే ఉంది. అయితే రామ్ చరణ్ విగ్రహంతో పాటు ఆయన చేతిలో ఉన్న కుక్కపిల్ల రైమ్ విగ్రహం కూడా తయారు చేస్తున్నారంట. రామ్ చరణ్ కి అత్యంత ఇష్టమైన డాగ్ రైమ్. ఇది ఫ్రెంచ్ బార్బేట్ జాతికి చెందింది. చరణ్ ఖాళీ సమయం దొరికితే రైమ్ తో స్పెండ్ చేస్తాడు. అలాగే ఎక్కడికి వెళ్లిన కచ్చితం రైమ్ ని తనతో పాటు చరణ్ తీసుకొని వెళ్తాడు. ఇది చాలా ఖరీదైన శునకం. మేడమ్ టుస్సాడ్ మ్యూజియంలో మైనపు విగ్రహం కోసం కొలతలు తీసుకోవడానికి వచ్చినపుడు రామ్ చరణ్ తో పాటుగా రైమ్ కూడా ఉందంట. ఆ శునకం విగ్రహాన్ని కూడా రామ్ చరణ్ తో కలిసి ఉండేలా డిజైన్ చేయడానికి మ్యూజియం నిర్వాహకులు ఇంటరెస్ట్ చూపించారంట. దీంతో టుస్సాడ్ మ్యూజియంలో మొదటిసారి ఒక సెలబ్రెటీతో పాటు అతనికిష్టమైన శునకాన్ని కూడా పెట్టబోతున్నారని తెలుస్తోంది. రామ్ చరణ్ పెంచుకోవడం వలన రైమ్ కి దక్కిన గౌరవం ఇది అని చెప్పాలి. త్వరలో ఈ మైనపు విగ్రహాన్ని సందర్శకులకి అందుబాటులోకి తీసుకొచ్చే ఛాన్స్ ఉందంట.

# తెలుగు ఆడియన్స్ కు డార్లింగ్ అవ్వాలని..!

అదేంటో కొంతమంది హీరోయిన్స్ కు అన్ని పర్ఫెక్ట్ గా ఉన్నా ఇంకా కెరీర్ లో వెనకపడి ఉంటారు. అలాంటి వారిని ఒక లిస్ట్ ఔట్ చేస్తే ముద్దుగుమ్మ ఇస్మార్ట్ బ్యూటీ నభా నటేష్ ముందు ఉంటుంది. నన్ను దోచుకుందువటే సినిమాతోనే తెలుగు ఎంట్రీ ఇచ్చిన నభా నటేష్ అందులో తన నటనతో మెప్పించింది. యువ హీరోల సరసన నటిస్తూ సత్తా చాటుతున్న అమ్మడు ఇస్మార్ట్ శంకర్ తో సూపర్ హిట్ అందుకుంది. ఆ సినిమా ఇచ్చిన బూస్టింగ్ తో వరుస క్రేజీ ఆఫర్ కొట్టేస్తుందని అనుకున్నారు కానీ అది జరగలేదు. మధ్యలో ఒక యాక్సిడెంట్ వల్ల నభా నటేష్ దాదాపు రెండేళ్ల వరకు బయటకు రాలేదు. చివరగా నితిన్ తో మ్యాస్ట్రో సినిమా చేసిన నభా నటేష్ ఆ తర్వాత ఒక్క ఛాన్స్ కూడా అందుకోలేదు. ఫైనల్ గా ప్రియదర్శి లీడ్ రోల్ లో తెరకెక్కిన డార్లింగ్ లో నటించింది నభా నటేష్. సినిమా చూస్తే ఇదేదో నభా ఫిమేల్ సెంట్రిక్ సినిమాలానే పూర్తి డామినేషన్ కనిపిస్తుంది. ఓ పక్క కమెడియన్ గా చేస్తూ మరోపక్క కంటెంట్ ఉన్న సినిమాల్లో సోలోగా ప్రయత్నిస్తున్న ప్రియదర్శి తన మార్క్ చాటాలని చూస్తున్నాడు. డార్లింగ్ సినిమాలో అతను హీరోగా చేస్తే నభా నటేష్ హీరోయిన్ గా నటించింది. సినిమాలో ఆమె పాత్ర కూడా కొత్తగా ఆడియన్స్ ని సర్ ప్రైజ్ చేసేలా ఉంటుందని అనిపిస్తుంది. ఐతే దాదాపు 3 ఏళ్ల తర్వాత అమ్మడు ఈ సినిమాతో వస్తుంది. డార్లింగ్ సినిమా మీద అమ్మడు చాలా హెూప్స్ పెట్టుకుంది. ఈ సినిమాతో మరోసారి తన స్ట్రెంగ్త్ చూపించేందుకు రెడీ అయ్యింది నభా నటేష్. డార్లింగ్ హిట్ పడితే కచ్చితంగా నభా కు మళ్లీ వరుస ఛాన్సులు వచ్చేస్తాయని చెప్పొచ్చు. అందంతోనే కాదు అభినయంతో కూడా మెప్పించగలిగే నభా నటేష్ ఇక మీదట తన ఫోకస్ అంతా టాలీవుడ్ మీదే పెట్టేస్తుంది. డార్లింగ్ సినిమాతో ఆడియన్స్ కు ఆమె డార్లింగ్ అవ్వాలని చూస్తుంది. మరి సినిమా అమ్మడికి ఎలాంటి రిజల్ట్ అందిస్తుంది అన్నది చూడాలి. ఇస్మార్ట్ శంకర్ సీక్వెల్ డబుల్ ఇస్మార్ట్ లో నభా చేస్తుందని ఆడియన్స్ అనుకున్నా ఆ ఛాన్స్ మిస్ అయ్యింది. డార్లింగ్ లో తన ఎనర్జీ మొత్తం చూపించేస్తున్న నభాకు కచ్చితంగా ఫ్యూచర్ లో మంచి పాత్రలు వచ్చేస్తాయని చెప్పొచ్చు.



# కల్లు కాంపౌండ్ పాటలో కేసీఆర్ మాటలు..
# పూరీ జగన్నాథ్ 'డబుల్ ఇస్మార్ట్' పాటపై దుమారం




**డబుల్ ఇస్మార్ట్' నుంచి 'మార్ ముంత.. చోడ్ చింత' లిరికల్ సాంగ్ విడుదల**

**పాటలో 'ఏం జేద్దమంటవ్ మరి' అన్న కేసీఆర్ మాట వెంటనే తొలగించి క్షమాపణలు చెప్పాలంటున్న బీఆర్ఎస్, తెలంగాణ ప్రజలు**

టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ రూపొందిస్తున్న డబుల్ ఇస్మార్ట్ శంకర్ నుంచి నిన్న విడుదలైన పాట బీఆర్ఎస్ ఆగ్రహానికి గురైంది. ఈ సినిమాలోని 'మార్ ముంత.. చోడ్ చింత' అనే లిరికల్ సాంగ్ విడుదలైంది. పక్కా మాస్‌బీట్‌లో సాగే ఈ పాటలో హీరో రామ్, హీరోయిన్ కావ్యాథాపర్ కల్లు సీసాలు పట్టుకుని చిందేస్తారు. ఈ పాట మధ్యలో ఇటీవల పాప్యులర్ అయిన 'ఏం జేద్దమంటవ్ మరి' మాటను వాడారు. దీనిపై బీఆర్ఎస్‌తో పాటు తెలంగాణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన నాయకుడి మాటను ఇలా కల్లు పాటకు వాడడం ఏంటంటూ ఫైర్ అయింది. ఈ మాటను దురుద్దేశపూర్వకంగానే అందులో ఇరికించారని ఆరోపిస్తోంది.పాటను రాసింది కాసర్ల శ్యామ్, సంగీతం అందించింది మణిశర్మ అయినా కేసీఆర్ మాటను దర్శకుడు పూరి జగన్నాథ్ నిర్ణయం మేరకే పెట్టారని ఆరోపిస్తున్నారు. పాట రాసిన శ్యామ్, పాడిన సిప్లిగంజ్ ఇద్దరూ తెలంగాణ వారే కావడం గమనార్హం. పాట నుంచి కేసీఆర్ మాటను తొలగించడంతోపాటు పూరి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.



# కొత్తగా చేద్దామనుకుంటే రెండేళ్ల గ్యాప్...!

టాలీవుడ్ యంగ్ అండ్ క్రేజీ హీరోల్లో రానా ఒకరు. ఈయన చేసిన సినిమాలు తక్కువే అయినా కూడా పోషించిన పాత్రలతో తనదైన ముద్రను ప్రేక్షకుల మీద వేయడంలో సక్సెస్ అయ్యాడు. ఆయన తలుచుకుంటే ఏడాదిలో నాలుగు అయిదు సినిమాలు చేయగలడు. సొంత బ్యానర్ లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తే అందులో ఏడాదికి రెండు మూడు అయినా హిట్ అవుతాయి. కానీ రానా అలా కోరుకోవడం లేదు. కెరీర్ ఆరంభం నుంచి కూడా చాలా ప్రత్యేకంగా ఉండే సినిమాలను ఎంపిక చేసుకుంటూ వచ్చాడు, గత ఏడాది విరాటపర్వం వంటి విభిన్నమైన సినిమాను చేయడం ద్వారా ఆయనలో ఉన్న నటుడు మరింతగా బయటకు వచ్చాడు. విరాట పర్వం తర్వాత రానా ఇప్పటి వరకు మరే సినిమాను కమిట్ అవ్వలేదు. తాజాగా ఒక అవార్డు వేడుక ప్రెస్ మీట్ లో రానా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. రెండేళ్ల గ్యాప్ గురించి రానా మాట్లాడుతూ.. అందరు చేస్తున్నట్లుగా కాకుండా కొత్తగా ప్రయత్నించాలనే ఉద్దేశ్యంతో కథలు వింటున్నాను, మంచి స్క్రిప్ట్ ల కోసం వెయిట్ చేస్తున్నాను. దాంతో రెండేళ్ల కాలం గడిచి పోయిందని అన్నాడు. త్వరలోనే రానా నుంచి మరో విభిన్న సినిమా రాబోతుందట. అందుకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయని తెలుస్తోంది. అతి త్వరలోనే సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. రానా కల్కి విజయం పట్ల స్పందిస్తూ ఆనందం వ్యక్తం చేశాడు. సినిమాలో భాగస్వామ్యం అయిన ప్రతి ఒక్కరికి అభినందనలు అన్నాడు.

# చేతికి, కాలుకి గాయాలయ్యాయి..
## ప్రమాదంపై యంగ్ హీరో ప్రకటన



నవీన్ పొలిశెట్టి కుడిచేతికి మల్టిపుల్ ఫ్రాక్చర్‌తో పాటు కాలికి కూడా గాయమైంది. అతడు నెమ్మదిగా కోలుకుంటున్నానని.. కఠినంగా ఉందని ప్రకటనలో పేర్కొన్నాడు.

త్వరలోనే పూర్తిగా కోలుకుంటానని చెప్పాడు. తన రాబోయే చిత్రాల గురించి ఉత్సాహంగా ఉన్నానని కూడా పేర్కొన్నాడు. సినిమాల ద్వారా తన అభిమానులతో కనెక్ట్ కాలేకపోతున్నందుకు నవీన్ క్షమాపణలు చెప్పాడు. మార్చిలో నవీన్ అమెరికాలో బైక్ ప్రమాదానికి గురయ్యాడు. అతని టీమ్ ఈ వార్తలను ధృవీకరించినప్పటికీ.. నవీన్ ఇప్పటివరకూ ప్రమాదం గురించి మౌనంగా ఉన్నాడు.నవీన్ ప్రకటనలో.. "దురదృష్టవశాత్తూ ఇటీవల నా కుడిచేయి ఫ్రాక్చర్ అయ్యింది.. నా కాలికి కూడా గాయమైంది. ఇది నాకు చాలా కష్టమైన, బాధాకరమైన సమయం. నేను సినిమాలలో నటించలేను. మీతో కనెక్ట్ అవ్వలేను. ఈ గాయం కారణంగా నేను కోరుకున్నంత వేగంగా సినిమాలను మీకు అందించలేకపోతున్నందుకు క్షమించండి. రికవరీ నెమ్మదిగా.. చాలా కఠినంగా ఉంది. కానీ నేను పూర్తిగా కోలుకోవడానికి వైద్య నిపుణులతో కలిసి పని చేస్తున్నాను. దీనికి మరికొన్ని నెలలు పట్టవచ్చు. మునుపెన్నడూ లేనంత ఆరోగ్యంగా.. నేను బలంగా తిరిగి రావాలని నిశ్చయించుకున్నాను. నా రాబోయే చిత్రాల కోసం నేను చాలా ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాను. డెవలప్‌మెంట్ పనులు ప్రతిరోజూ జోరుగా జరుగుతున్నాయి. పూర్తిగా కోలుకున్న తర్వాత నేను వాటిని షూట్ చేస్తాను. దయచేసి నా నుండి వచ్చే అప్‌డేట్‌లను మాత్రమే నమ్మండని రాశారు.